క్లుప్తంగా

ఘనంగా సహకార వారోత్సవాలు

తాడూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకారం కేంద్రం ఆవరణలో శుక్రవారం సహకార వారోత్సవాలను పురస్కరించుకొని వారోత్సవాల జెండాను సింగిల్‌విండో అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులపాటు సహకార వారోత్సవాలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. 7 రంగుల జెండా విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది శివ, సురేష్, కృష్ణ, రైతులు కందర్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణకు చర్యలు



కొల్లాపూర్: పట్టణంలోని కేఎల్ఐ గెస్ట్‌హౌజ్ ఎదుట రహదారిని విస్తరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నెల 27న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొల్లాపూర్‌కు రానుండడంతో రహదారి విస్తరణకు శ్రీకారం చుట్టారు. రహదారిని అనుసరించి ఉన్న చిరు వ్యాపారుల డబ్బాలను గురువారం రాత్రి తొలగించారు. మరోవైపు ఉన్న డబ్బాలను కూడా తీసేయాలని సూచించారు. ప్రధాన మురుగు కాలువను కూడా ఆధునీకరించేందుకు పనులు ప్రారంభించారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



చారకొండ: హామీల అమలులో కాంగ్రెస్ విఫలం అయ్యిందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గప్రసాద్ విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. దేశం మొత్తం బీజేపీ వైపు చూస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి సభ్యత్వాలు పూర్తి చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు జానకి, నాయకులు కృష్ణ, చంద్రారెడ్డి, శ్రీకాంత్, కన్నా తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎంబీ చర్చి మహిళల ఉజ్జీవ సదస్సు

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఎంబీ చర్చి ఆవరణలో శనివారం మహిళలు ఉజ్జీవ సదస్సు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కేంద్రం నుంచి పాస్టర్ సఫియా పాల్గొని మాట్లాడారు. సమాజంలో మహిళల పాత్ర ఎంతో ప్రాధాన్యమైందన్నారు. ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. ఎంబీ చర్చి చైర్మన్ సంపత్‌కుమార్, క్రైస్తవులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



తాడూరు: మండల కేంద్రానికి చెందిన పెద్ద కుర్మయ్య(65) అనారోగ్యంతో మృతి చెందాడు. మాజీ ఎంపీటీసీ సంద రేణుక, మల్లయ్యలు బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పర్వతాలు, మేస్త్రీ మల్లేష్, శేఖర్, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల పార్కింగ్ పనులు ప్రారంభం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం మౌలిక వసతులు కల్పించాలని ఇటీవల మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించడంతో శుక్రవారం వాహనాల పార్కింగ్ పనులను పర్యాటక శాఖ జిల్లా అధికారి నరసింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. స్నానపు గదులు, షవర్స్, సీసీ నిర్మాణాలు, తాగునీటి వసతి, మూత్రశాలల పనులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు

చారకొండ: మండల కేంద్రానికి చెందిన గ్రామీణ వైద్యుడు చిల్వేరు శ్రీనివాసులు భక్తుల సౌకర్యార్థం శుక్రవారం శ్రీశైల పుణ్యక్షేత్రం పద్మాశాలి సత్రం ఆవరణంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు.



కల్వకుర్తి వేంకటేశ్వరస్వామి ఆలయంలో



చారకొండ మండలం సిర్సనగండ్లలో



ఉప్పునుంతల కేదారేశ్వరాలయంలో



దోమలపెంట ఎడమ పాతాళగంగ వద్ద..



తిమ్మాజిపేట మండలం అప్పాజిపల్లిలో



సోమశిల వద్ద కృష్ణానదిలో స్నానాలు చేస్తున్న భక్తులు

ఆలయాల్లో కార్తీక శోభ



బిజినేపల్లి మండలంలోని పాలెం వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో..



తాడూరు మండలం శిర్సవాడలో..



నాగర్‌కర్నూల్‌లో ..

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు పోటెత్తారు. భక్తులతో ఆలయాలు కిటికిటలాడాయి.

■ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డు శివాలయం, రామస్వామి దేవాలయాలు భక్తుల రద్దీ కనిపించింది. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సహస్ర మహాగాయత్రి యజ్ఞం భక్తిశ్రద్ధలతో కొనసాగింది.

■ అచ్చంపేట వాసవీకన్యకాపరమేశ్వరిలో భ్రమరాంబశివపార్వతుల కల్యాణం, కోటి దీపోత్సవం నిర్వహించారు. శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో శివలింగానికి అభిషేకం చేశారు. పలకపల్లి రామలింగేశ్వర ఆలయంలో వ్రతాలు ఆచరించారు.

■ కొల్లాపూర్ మండలంలోని సోమశిల గ్రామ సమీపంలో ఉన్న కృష్ణానది బ్యాక్ వాటర్‌లో పుణ్య స్నానాలు ఆచరించారు. సోమేశ్వరాలయంలో కోటి దీపోత్సవం నిర్వహించారు.



కొల్లాపూర్‌లోని శివాలయంలో ..



సోమశిల సోమేశ్వరాయంలో ఆవరణలో కోటి దీపారాధన నిర్వహిస్తున్న భక్తులు

■ తాడూరు మండలంలోని శిర్సవాడ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో అభిషేకాలు, సహస్రనామహోమం, సామూహిక వ్రతాలు ఆచరించారు.

■ బిజినేపల్లి మండలంలోని పాలెం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

■ కల్వకుర్తి మండలంలోని వేంకటేశ్వస్వామి, కన్యకాపరమేశ్వరి దేవాలయంలో భక్తులు దీపాలను వెలిగించారు.

■ లింగాల మండల కేంద్రంలోని కోదండరామాలయంలో తులసి చెట్టుకు కల్యాణం, సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

■ దోమలపెంట శ్రీశైలం ఆనకట్ట దిగువున ఎడమ పాతాళగంగ వద్ద కృష్ణానదిలో పవిత్ర స్నానాలు ఆచరించారు. నదిలో దీపాలను వదిలారు.

■ మన్ననూర్ వేణుగోపాలస్వామి ఆలయంలో కార్తీక శోభ సంతరించుకుంది. లింగమయ్య స్వామి ఆలయంలో అన్నపూర్ణ ట్రస్టు, గార్లపాటి బ్రదర్స్ సంయుక్త ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

■ తిమ్మాజిపేట మండలంలోని అప్పాజిపల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. కోటి దీపోత్సవం ఆకట్టుకుంది.

■ ఉప్పునుంతల కేదారేశ్వరాలయంలో భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం చేశారు. ఆలయం వద్ద సాయంత్రం కార్తీక దీపారాధన కార్యక్రమాన్ని చేపట్టారు.

■ వెల్దండ మండలంలోని గుండాలలో అంబా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు.

■ చారకొండ మండలంలోని సిర్సనగండ్ల సీతా రామచంద్రస్వామి దేవాలయంలో శుక్రవారం సత్యానారాయణ స్వామి సాముహిక వ్రతాలను వైభవంగా నిర్వహించారు.

■ కోడేరు మండలంలోని పలు గ్రామాల్లో కార్తీక శోభ సంతరించుకుంది. భక్తులు గ్రామంలో ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మన్ననూరులో..



పలకపల్లి రామలింగేశ్వర ఆలయంలో..

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

పెంట్లవెల్లి: మండలంలోని సింగవరంలో శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఏ రకం ధాన్యానికి రూ.2320, బీ రకం ధాన్యానికి రూ.2300 లు ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుందన్నారు.

వాగును పరిశీలించిన నాయకులు

మండలంలోని సింగవరం గ్రామాన్ని కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. గ్రామ సమీపంలో ఉన్న వాగును గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. మండల కేంద్రం చేరుకునేందుకు గోపులాపురం, జటప్రోల్ గ్రామాల మీదుగా మండలానికి చేరుకోవాల్సి వస్తుందని అదనంగా 6 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోయారు. వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. రాములు, చెన్నయ్య, సురేందర్‌గౌడ్, బాలరాజు, నర్సింహనాయుడు, రాజులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేట, జీడిపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభిస్తారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్ కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డిలు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లి, కాంసానిపల్లి, తాడూరు, పెనిమిళ్ల, మొల్గరలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రారంభిస్తారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంత రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా బిర్సా ముండా జయంతి



అచ్చంపేటలో బిర్సా ముండా జయంతి వేడుకల్లో విద్యార్థులు



కొల్లాపూర్‌లో..

అచ్చంపేట: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం బిర్సా ముండా జయంతి వేడుకలు నిర్వహించారు. వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో మల్లికార్జున విద్యార్థి నిలయం విద్యార్థులు పట్టణంలోని పురవీధుల గుండా జనజాతి గౌరవ దివస్ శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది రాజుకుమార్, యాదయ్య, వనవాసీ కల్యాణ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు గట్టు అశోక్ రెడ్డి, జిల్లా సంఘటన కార్యదర్శి శ్యామల సాగర్‌కుమార్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రచారకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని గుండాలలో ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో శుక్రవారం భగవాన్ బిర్సాముండా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరేగింపు నిర్వహించారు. ప్రిన్సిపాల్ పర్దీప్‌కుమార్ మాట్లాడుతూ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గిరిజన ప్రజలతో కలిసి సైనిక విప్లవం సృష్టించిన గొప్ప వీరుడు బిర్సాముండా అని కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా జాతీయ గౌరవ దివస్‌ను జరుపుకుంటామన్నారు. పర్వత్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుమన్, భాస్కర్ ఉన్నారు.

కొల్లాపూర్ రూరల్: పట్టణంలో ఆదివాసి చెంచులు ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో బిర్సాముండా 150వ జయంతి సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీటీ లింగాల ఏరియా టీం లీడర్ రాధ మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల సాధనకు బ్రిటిష్ వారితో పోరాటం చేసి ఆదివాసి హక్కులు సాధించిన గొప్ప మహనీయుడు బిర్సాముండా అని కొనియాడారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని చెంచుగూడెంలకు చెందిన వారు పాల్గొన్నారు. మొలచింతపల్లి మాజీ సర్పంచ్ ఐలేని వెంకటస్వామి, నిమ్మల శివ, బలమూరి లింగస్వామి, పరమేష్, భరత్, రాములు, తదితర చెంచు మహిళలు పాల్గొన్నారు.

బీమా బాండ్లు పంపిణీ



మన్ననూర్: అటవీశాఖలో అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు వన రక్షక్ సేవా సమితి ఏజెన్సీ ద్వార కల్పించిన ప్రమాదబీమా పథకం బాండ్లను డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రమాదం జరిగినప్పుడు కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు బీమా సౌకర్యం కల్పిస్తునట్లు పేర్కొన్నారు. ప్రమాద తీవ్రతను బట్టి ఆస్పత్రి ఖర్చుల కోసం సుమారు రూ: 2 లక్షల వరకు అందజేసే అవకాశం ఉంటుందన్నారు. ఉద్యోగి మరణిస్తే రూ.10 లక్షలబీమా వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓలు రామ్మూర్తి, తిరుమల రావు, ఎఫ్‌ఆర్‌ఓలు, ఎఫ్‌ఎస్‌ఓలు, బీట్ ఆఫీసర్లు సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన అధికారులు



తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వేను ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ బ్రహ్మచారిలు శుక్రవారం పరిశీలించారు. మండలంలోని పొల్మూరు, లచ్చిరాంతండా, మేడిపూర్ ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించడంతోపాటు సర్వే చేసే విధానంపై ఎన్యుమరేటర్లకు అవగాహన కల్పించారు.

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్టలో పంచాయతీ సెక్రెటరీ అశ్విని ఆధ్వర్యంలో సర్వే కొనసాగింది.

అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు

నాగర్‌కర్నూల్ క్రైం: సోషల్‌మీడియాలో ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు, అసత్య ప్రచారాలు చేస్తున్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని శుక్రవారం తెలకపల్లి మండల మాజీ ఎంపీపీ పర్వతాలు జిల్లా కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అచ్చంపేట: అచ్చంపేట టౌన్-1 ఫీడర్‌లో 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా 16న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు ఏఈ అంజనేయులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరకాలనీ, శ్రీనగర్‌కాలనీ, వినాయకనగర్ కాలనీ, ఆదర్శనగర్, లింగాలరోడ్డు, ఉట్లకోనేరు, బస్టాండు ఏరియా, ఇందిరానగర్, మహేంద్రనగర్, పెద్దమ్మగుడి, గోకల్‌నగర్, టంగాపూర్, చింతల్‌బస్తీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. టౌన్-2 ఫీడర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు మరమ్మతు చేపడుతున్నట్లు తెలిపారు. టీచర్స్‌కాలనీ, కన్యాకపరమేశ్వరి ఆలయం, రాంనగర్‌కాలనీ, పలకపల్లిరోడ్డు, లక్ష్మీటాకీస్, ఆర్‌డీఓ కార్యాలయం, ఉప్పునుంతల రోడ్డు,ప్రభుత్వ అస్పత్రి,కూరగాయాల మార్కెట్, వ్యవసాయ మార్కెట్, సాయినగర్, సాయిరాం టాకీస్, జూబ్లీనగర్, వైజంక్షన్, అటవీ కార్యాలయం, రాజీవ్‌నగర్ కాలనీ, వలపట్ల, శ్రీరామ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు పేర్కొన్నారు. అదేవిధంగా చౌటపల్లి ఫీడర్‌లోని 11 కేవీ విద్యుత్ లైన్ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గుంపన్‌పల్లి, చౌటపల్లిలో కరెంట్ ఉండదని వివరించారు.

వ్యక్తిగత వివరాల సేకరణ తగదు

కల్వకుర్తిరూరల్: కుల గణన పేరుతో వ్యక్తిగత వివరాల సేకరణ చేయడం సరికాదని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుల్జాల పరశురాములు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుల గణన చేయాలని ప్రభుత్వం ఇంటింటి సర్వే చేపట్టిందన్నారు. ఈ సర్వే పత్రంలో కులంతోపాటు రాజకీయ, వ్యవసాయ భూములకు సంబంధించిన వ్యక్తిగత వివరాలు నమోదు చేయడంపై అనుమానాలకు తావిస్తోందన్నారు. రేషన్‌కార్డులు, సంక్షేమ పథకాలను రద్దు చేసేందుకే సర్వే చేస్తున్నారని ప్రజల్లో ఆందోళన మొదలైందని దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. అపోహలు తొలగించేందుకు ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి సలహాలు తీసుకోవాలని కోరారు.

కౌండిన్య మహర్షికి ఘన నివాళి



పెద్దకొత్తపల్లిలో గౌడ సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని ఎర్రగడ్డ కాలనీలో శుక్రవారం గౌడ జాతి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కౌండిన్య మహర్షి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జై గౌడ సంఘం మహిళా అధ్యక్షులు సోమప్రగతిగౌడ్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల నుంచి మానవ, వృక్ష, జంతువులను కాపాడిన మహనీయుడు కౌండిన్య మహర్షి అని కొనియాడారు. గౌడ కులస్తులు జ్యోతిగౌడ్, సునీతగౌడ్, కల్పన, భాస్కర్‌గౌడ్, రమాదేవి, యశోద, నిర్మల, కవిత, పుష్ప, చంద్రకళ, సుధా కాలనీవాసులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: జైగౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీకౌండిన్య మహర్షి జయంతి వేడుకలను నిర్వహించారు. జై గౌడ మండల అధ్యక్షుడు యుగేందర్‌గౌడ్ కౌండిన్య మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు లింగస్వామిగౌడ్, మోహన్‌గౌడ్, సింగోటిగౌడ్, చక్రాధర్‌గౌడ్, నిరంజన్‌గౌడ్, రమేష్‌గౌడ్, పరశురాంగౌడ్ పాల్గొన్నారు.

మారుతీ కొత్త మోడల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ



మారుతీ నూతన మోడల్ డాజిలింగ్ డిజైర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని మారుతీ షోరూంలో శుక్రవారం కొత్త వేరియంట్ మారుతీ డాజిలింగ్ డిజైర్‌ను ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కారును టెస్ట్‌డ్రైవ్ చేసి ఫీచర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచి ఫీచర్లతో నూతన కారు తయారు చేయడం అద్భుతమన్నారు. కార్యక్రమంలో మారుతీ సుజుకీ మేనేజర్ గిరిధర్ గౌడ్, టీం లీడర్ మహేందర్, కౌన్సిలర్ కావలి శ్రీను, కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, హరీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

లింగాల: నాగర్‌కర్నూల్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వసతి గృహాల విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో లింగాల బీసీ వసతి గృహానికి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వాలీబాల్ పోటీలలో విద్యార్థి యోగి ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌డబ్ల్యూఓ శివయ్య తెలిపారు. అదే విధంగా ఖోఖో విభాగంలో వెంకట్, శివస్వామి, ప్రేమ్‌కుమార్ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గోవింద్‌రావు

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్ళపల్లిలో శుక్రవారం స్వచ్ఛ భారత్‌పై ఏర్పాటు చేసిన గ్రామసభలో ఎంపీడీఓ గోవింద్‌రావు మాట్లాడారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండాలన్నారు. వారానికి ఒక్కసారి సమయం కేటాయించి ఇంట్లోని నిల్వ నీటిని పారబోసి నూతన నీటిని పట్టుకోవడం, పరిసరాలను శుభ్రం చేసుకోవడం వంటి వాటిపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. స్వచ్ఛ గ్రామాలుగా మార్చుటకు ప్రతి ఒక్కరు తోడ్పాటునందించాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి నీలమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రూప్- 4 అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపిక



శివప్రసాద్



శ్రీకాంత్



లలిత

పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా చిన్నకార్పాముల గ్రామానికి చెందిన చింతపల్లి శివప్రసాద్ జిల్లాలో రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో మొదటి ర్యాంకు సాధించాడు. రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్ పోస్టును పొందాడు. ఈ సందర్భంగా శివప్రసాద్‌ను చిన్నకార్పాముల గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, నాయనోనిపల్లి మైసమ్మ ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ అభినందించారు.

ఉద్యోగాలకు అన్నాచెల్లెలు ఎంపిక

వెల్దండ: మండలంలోని రాచూర్ గ్రామానికి చెందిన అన్నాచెల్లెలు శ్రీకాంత్, లలితలు గ్రూప్-4 ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. శ్రీకాంత్ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని భూపరిపాలన విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా, లలిత ఉస్మానియ యూనివర్శిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగాలకు ఎంపికైనారు.

బిజినేపల్లి: మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన శిరీష్ చంద్ర గ్రూప్-4లో ప్రతిభ కనబర్చి జూనియర్ అకౌంటెంట్‌గా అర్హత పొందాడు.

జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపిక

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం గ్రామానికి చెందిన తుపాకుల నాగరాజు జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. గ్రూపు -4 ఉద్యోగం సాధించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.